www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | మంగళవారం 8, సెప్టెంబర్, 2026

## గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి

# కదలికలు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతంపేట, గరీబ్ పేట, అబ్బుగూడెంలలో ప్రతిపాదిత భూముల పరిశీలన
- ఏఏఐ అధికారులతో కలిసి అటవీ ప్రాంతాల్లో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన
- బురదలో నడుస్తూ.. గుట్టలు ఎక్కుతూ అనువైన ప్రాంతాల పరిశీలన
- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న విమానయాన కల సాకారం దిశగా కీలక అడుగు






**భద్రాద్రి కొత్తగూడెం ,సెప్టెంబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి స్థల ఎంపిక ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. గతంలో పరిశీలించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో.. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన ఆరు ప్రత్యామ్నాయ ప్రాంతాలపై కేంద్ర సాంకేతిక బృందం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. సుజాతనగర్ మండలం సీతంపేట, లక్ష్మీదేవి పల్లి మండలం గరీబ్ పేట, అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం ప్రాంతాల్లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రత్యేక చొరవతో అధికారులతో కలిసి పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.

### ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించి

## పకడ్బందీగా విచారణ చేపట్టాలి






రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి.

- ప్రతి ఓటరుకు నోటీసు అందేలా చర్యలు తీసుకోవాలి.
- విచారణ ప్రక్రియను పారదర్శకంగా,నిబంధనల ప్రకారం నిర్వహించాలి.
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.

**భద్రాద్రి న్యూస్ ములుగు**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, వారితో పకడ్బందీగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు..

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి




**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):** ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక ..

**జిల్లా కలెక్టర్ అంకిత్**

- ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- ప్రజలకు చేరువగా ప్రజావాణి - మండలాల్లోనూ నిర్వహణ

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కదలికలు

**మొదటి పేజీ తరువాయి**

బురద డొంకల మీదుగా కాలినడకన వెళ్లి, కొండ ప్రాంతాల్లో తిరుగుతూ అటవీ ప్రాంతాల్లోకి ముందుకుసాగారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి ఉన్న అవకాశాలు, విమానాల రాకపోకలకు అనువుగా ఉంటాయా? తదితర అంశాలను అధికారులు అంచనా వేశారు.

**సాంకేతిక అంశాలపై అంచనా..**

ప్రతిపాదిత ప్రాంతాల్లో విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనువైన పరిస్థితులు, భౌగోళిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలను కేంద్ర బృందం పరిశీలిస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సాంకేతిక నివేదికను రూపొందించనుంది. ఆ నివేదిక ఆధారంగా విమానాశ్రయానికి అనువైన ప్రాంతాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది.

**దశాబ్దాల కలకు రెక్కలు**

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులతో పాటు.. జిల్లాలోని పారిశ్రామిక, పర్యాటక, రవాణా రంగాల అభివృద్ధికి విమానాశ్రయం కీలకం కానుంది. దశాబ్దాల కాలంగా ఈ ప్రాంత ప్రజలకు అందని విమానయాన సదుపాయం ఇప్పుడు సాకారం అయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి.

**నేడు.. దుమ్ముగూడెం, పాల్వంచ మండలాల్లో పరిశీలన**

కేంద్ర బృందం మంగళవారం దుమ్ముగూడెం, పాల్వంచ మండలాల్లో ప్రతిపాదిత స్థలాలను పరిశీలించనుంది. అన్ని ప్రాంతాల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన అనంతరం విమానాశ్రయానికి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటుపై ఆశలు మరింత బలపడ్డాయి.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

**మొదటి పేజీ తరువాయి**



సంస్థలు అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను .. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదిక అని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు.

తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి, స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్య పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు**

దుమ్ముగూడెం మండలం పర్ణశాలకు చెందిన బానోతు భవిత గత ఆరు సంవత్సరాలుగా పర్ణశాలలోని నార చీరల వద్ద కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల గోదావరి వరదల కారణంగా షాపు నీట మునిగిందని, తిరిగి షాపు ఏర్పాటు చేసుకునే సమయంలో తన స్థలంలో వేరే వ్యక్తులు షాపు ఏర్పాటు చేశారని,ఈ విషయంపై తహసీల్దార్‌కు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, తన షాపు స్థలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్‌కు ఎండార్స్ చేశారు.

జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ ప్రజలు గత ఆరు సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జూలూరుపాడు ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.

మణుగూరు మండలం సమితిసింగారం గ్రామపంచాయతీకి చెందిన గుండి సౌజన్య అంగన్వాడీ టీచర్ పోస్టుకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని అర్హత సాధించానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు అర్హతలను పరిశీలించి అంగన్వాడీ టీచర్ పోస్టు కేటాయించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి చెందిన 65 గిరిజన కుటుంబాలు సుమారు 35 సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్నామని తెలిపారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. గ్రామానికి అంగన్వాడీ కేంద్రం లేదా ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓకు ఎండార్స్ చేశారు.

ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామానికి చెందిన ధనసరి పగిడిద్దరాజు సర్వే నంబర్ 617లో తనకు ఐదు ఎకరాల పట్టా భూమి ఉండగా, సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కోసం రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన మూడు ఎకరాల భూమికి సంబంధించిన పాత రికార్డులను సవరించి, తన పేరుపై నూతన పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్షన్ అధికారికి ఎండార్స్ చేశారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమల అమలు లో జిల్లా ను ముందంజ లో నిలబెట్టాలి

**గర్భిణులకు నెలవారీ ఆరోగ్య పరీక్షలను నిర్వహించడంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లాలో విస్తృతంగా ఎన్సీడీ స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహించాలి.. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిల్**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల అమలుతీరు, గర్భిణీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న సిజేరియన్ కేసులు,తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే గర్భిణులకు నెలవారీ ఆరోగ్య పరీక్షలను నిర్వహించడంపై వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.

సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల అమలుతీరు, గర్భిణీల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న సిజేరియన్ కేసులు, తదితర అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవల్లో జిల్లా ముందంజలో నిలవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది మాతా శిశు సంరక్షణ సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు.

## ఎస్ఐఆర్‌లో నోటీసుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

**నో మ్యాపింగ్, అనామెలీస్ జాబితాలోని ఓటర్లకు త్వరితగతిన నోటీసులు జారీ చేయాలి**

**నిర్ణీత గడువులోగా పరిశీలన, హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):**



హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామెలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు)తో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో భాగంగా నో మ్యాపింగ్, అనామెలీస్ జాబితాకు సంబంధించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన డాక్యుమెంట్ల ఆధారంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, సంబంధిత ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత ఈఆర్ఓలు నిర్దేశిత కార్యాచరణ ప్రకారం హియరింగ్‌లు నిర్వహించి, పరిశీలన అనంతరం సరైన మరియు సంబంధిత డాక్యుమెంట్లను మాత్రమే పోర్టల్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిశీలించి క్లియర్ చేసేలా పర్యవేక్షించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి జిల్లా స్థాయిలో, అలాగే ఈఆర్ఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు నోటీసులు అందించిన వెంటనే, సమర్పించాల్సిన డాక్యుమెంట్లు, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియపై వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ , జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 60 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన జారీ చేసి ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. హియరింగ్‌లను నిర్దేశిత కార్యాచరణ ప్రకారం నిర్వహిస్తున్నామని, ఓటర్లు సరైన డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవసరమైన అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నో మ్యాపింగ్, అనామెలీస్‌కు సంబంధించిన ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసేలా సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## ఎస్ఐఆర్‌లో అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు అందించి పకడ్బందీగా విచారణ చేపట్టాలి



**మొదటి పేజీ తరువాయి**

హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని సూచించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించి, వారి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి పై జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలో అసమానతలు ఉన్న, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి 41,900 నోటీసులు సిద్ధం చేయగా, ఇప్పటివరకు 24,394 నోటీసులను జారీ చేసి సంబంధిత వివరాలను యాప్‌లో నవీకరించినట్లు తెలిపారు. నోటీసులపై విచారణ ప్రక్రియను పూర్తి చేసి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎండీ సలీం, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ ఎం. నితీష్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకలకు దూరంగా..

### నేపాల్ వరద బాధితులకు రూ.10 వేల సాయం



**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 07 (భద్రాద్రి న్యూస్):**
నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదల నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన ఆర్. ప్రశంస, ఆర్. జన్విత మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. తమ పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉంటూ, ఆ మొత్తాన్ని నేపాల్ వరద బాధితుల సహాయార్థం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ను కలిసి రూ.10 వేల విలువైన చెక్కును అందజేశారు. చిన్న వయసులోనే బాధితుల పట్ల మానవత్వాన్ని చాటుతూ సహాయ కార్యక్రమానికి ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పుట్టినరోజు వేడుకలకు ఖర్చు చేయాల్సిన మొత్తాన్ని వరద బాధితుల సహాయార్థం అందించడం ద్వారా ప్రశంస, జన్విత ఆదర్శంగా నిలిచారని అధికారులు, ప్రజలు అభినందించారు.

# ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతను వెంటనే ప్రారంభించాలి

**-అర్హులైన ప్రతీ పేద కుటుంబానికీ సొంతింటి కల నెరవేర్చాలి**
**-రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా మంజూరు చేయాలి**
**-సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు**

**జూలూరుపాడు/చంద్రుగొండ (భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:**



పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక పేద కుటుంబాలు సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో రెండు,మూడు కుటుంబాలు కలిసి నివసించాల్సిన దయనీయ పరిస్థితి ఉందనడానికి క్షేత్రస్థాయి పరిస్థితులే నిదర్శనమని పేర్కొన్నారు. అర్హత ఉన్నప్పటికీ మొదటి విడతలో ఇల్లు రాని పేదలు రెండో విడతపైనే ఆశలు పెట్టుకున్నారని,ప్రభుత్వం స్పందించి తక్షణమే జాబితాలను సిద్ధం చేయాలని కోరారు. ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా అధికార యంత్రాంగం కేవలం అర్హతే ప్రామాణికంగా,పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టాలని, పేదల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అధికార యంత్రాంగం నిజమైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరులో రాజకీయ జోక్యం లేకుండా నిరుపేదలను గుర్తించి అర్హులకు ఇవ్వాలని కోరారు.

# స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

**-మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ**



**చంద్రుగొండ/జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:**
అసెంబ్లీ వద్ద పోలీసులతో వాగ్వాదం సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ తెలిపారు. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తీవ్ర పదజాలంతో మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే క్షమాపణ చెప్పాలని, ఆయన ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్ తదితర ప్రజాప్రతినిధులు కూడా ఎమ్మెల్సీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫజల్ బక్షి, బోరా సురేష్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్, కేసి బోయిన నరసింహారావు, చంద్రుగొండ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉపసర్పంచ్ అంతటి రామకృష్ణ, తదితులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటు





**– నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు లకావత్ గిరిబాబు**

**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:**
మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ రాస్తారోకో నిర్వహించారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నేషనల్ హైవేపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు... కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే ఇటువంటి డ్రామాలకు తెరలేపిందని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులను, బీఆర్ఎస్ నాయకులను అసెంబ్లీకి రానీయకుండా అడ్డుకున్నంత మాత్రాన తమ పోరాటం ఆగిపోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనా విఫలాలను నిరంతరం ప్రజాక్షేత్రంలోనే ఎండగడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు చాపలమడుగు రామ్మూర్తి బాదావత్ నరేష్ (గుండెపూడి ఉప సర్పంచ్) నిమ్మటూరి కనకయ్య (పాపకొల్లు మాజీ ఉప సర్పంచ్), బానోత్ హరిలాల్, పురస్తపురవు రామకృష్ణ, ఇల్లంగి తిరుపతి, పోతిన్ని బాబు, గూగులోత్ వెంకటేష్, పోతురాజు రామారావు, యువజన నాయకులు రామిశెట్టి వంశీ, పోతిన్ని రాంబాబు, జాటోత్ నరేష్, హలవత్ సూర్య భాయ్, గరిక ప్రభాకర్, హలవత్ గణేష్, లకావత్ గణేష్, భూక్యా రాందాస్ బానోత్ రవి మాచర్ల వీరన్న మరియు తదితరులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువజన నాయకులు పాల్గొన్నారు....

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే లపై పోలీసుల దాడులను తీవ్రంగా ఖండించిన రామ్మూర్తి

**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్ )ప్రతినిధి:**
తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై దాడులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి తీవ్రంగా ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు నాయకత్వంలో అసెంబ్లీలోకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, శాసనమండలిలో ఎమ్మెల్సీలపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.

ప్రత్యేకంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ తదితర నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలను విస్మరించిందని ఆయన విమర్శించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా ఆయా వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు.



ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల తరఫున గొంతెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకోవడం, వారిపై పోలీసులతో దాడులు చేయించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని ఆయన అన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను ఆపలేరని స్పష్టం చేశారు.

అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేటీఆర్ , తన్నీరు హరీష్ రావు, మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి , సునీత లక్ష్మారెడ్డి, తదితరుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు చాపలమడుగు రామ్మూర్తి తీవ్రంగా ఖండించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులపై ఇలాంటి చర్యలకు పాల్పడితే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులపై జరిగిన ఘటనలకు బాధ్యులైన వారు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు....

# ప్రజాస్వామ్యంలో ఎమ్మెల్యేలపై దౌర్జన్యం ఏమిటి ?





**– ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పుతున్న బీఆర్ఎస్ నేతలను అడ్డుకోవడం అప్రజాస్వామికం**
**– రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందా, రౌడీ రాజ్యమా**
**– కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నది**
**–మాజీ ఎమ్మెల్యే మెచ్చ**

**చంద్రుగొండ/జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్ )ప్రతినిధి:**
అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రంగా విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పుతున్న బీఆర్ఎస్ నేతలను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్, హరీష్‌రావుతో పాటు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందా, రౌడీ రాజ్యమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ చంద్రుగొండ ఎంపీడీవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, మేడా మోహన్‌రావు, ప్రవీణ్ ప్రకాష్, కృష్ణవేణి, భూపతి రమేష్, భూపతి శ్రీను, అంజనరావు, ఉప్పతల గణేష్, మంద అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 420 హామీలు అమలు చేయాలి.. లేకుంటే రాజీనామా చేయాలి

**ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల వినతిపత్రం**

**చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:** అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని, హామీలు అమలు చేయలేని పక్షంలో ప్రభుత్వం రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని చంద్రుగొండ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. తొలుత ప్రధాన సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణ మాజీ అధ్యక్షుడు సూరా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు నరకుళ్ల సత్యనారాయణ, సర్పంచ్ ఇర్ప స్రవంతి, సయ్యద్ జాఫర్మియా, మాజీ మండల ప్రధాన కార్యదర్శి సంగొండి రాఘవులు, మాజీ మండల ఉపాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చర్ల ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే!

**ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేసిన బీజేపీ మండల అధ్యక్షుడు నూప రమేష్**

**మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు–సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్**

**చర్ల, సెప్టెంబర్ 7 (భద్రాద్రి న్యూస్)**







చర్ల మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూప రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం చర్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అధికారులను కలిసి ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూప రమేష్ మాట్లాడుతూ.. చర్ల మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు మౌలిక వసతుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పిస్తున్నప్పటికీ, వాటిపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను కేవలం అర్జీలకే పరిమితం చేయకుండా వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని అన్నారు. మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని నూప రమేష్ స్పష్టం చేశారు. అధికారులు స్పందించకపోతే సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి ఆందోళనలు, ప్రజాపోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వినాయక చవితి పేరుతో ఎస్టీ కోయ హక్కులకు ముప్పు..? ఆదివాసీలకు అభి హెచ్చరిక

**సంప్రదాయాలు మరిస్తే సర్టిఫికెట్లు పోతాయా..? ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంచలన వ్యాఖ్యలు**

**ఆదివాసీ అస్తిత్వాన్ని కాపాడుకోండి.. లేకుంటే ఎస్టీ హక్కులపై ప్రశ్నలు తప్పవు!**

**చర్ల, సెప్టెంబర్ 7: భద్రాద్రి న్యూస్**








ఆదివాసీ గ్రామాల్లో తమ సంప్రదాయాలకు విరుద్ధంగా ఇతర పండుగలను నిర్వహించడం వల్ల భవిష్యత్‌లో ఎస్టీ కోయ కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ చర్ల మండల అధ్యక్షుడు కంగాల అభి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆదివాసీ గిరిజనులు, గ్రామ పెద్దలు, పూజారులు, పటేల్‌లు, ఆదివాసీ మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, యువత, మహిళలు ఈ అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందని అభి పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, గోత్రాచారాలు, పండుగలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పెయిన్ పండుగ, విజ్జ పండుగ, ముత్యాలమ్మ తల్లి పూజలు, సమ్మక్క--సారక్క జాతర, కొత్తల పండుగ, కుర్పిన్ పండుగ, చిక్కుడు పండుగ, రేల పండుగ, కొడతా పండుగ, భీమిలి పండుగలి వంటి ఆదివాసీ సంప్రదాయ పండుగలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర పండుగలను ఘనంగా నిర్వహించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ఆదివాసీ సంప్రదాయాల్లో లేని పండుగలను నిర్వహించడం, మండపాలు ఏర్పాటు చేసి పూజలు చేయడం వంటి అంశాలను భవిష్యత్‌లో కొందరు తమకు అనుకూలంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని అభి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అంశాలను ఫోటోలు, వీడియోల రూపంలో నమోదు చేసి, వాటి ఆధారంగా కోయ ఎస్టీ ధ్రువీకరణ పత్రాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసే పరిస్థితులు ఏర్పడవచ్చని ఆయన హెచ్చరించారు.

"మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి.. మన పండుగలను, ఆచారాలను విస్మరిస్తే భవిష్యత్ తరాలకు మన ఆదివాసీ అస్తిత్వం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ప్రతి ఆదివాసీ గ్రామం అప్రమత్తంగా ఉండాలి"ళి అని అభి సూచించారు. ఆదివాసీ సమాజం తమ మూల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ చర్ల మండల అధ్యక్షుడు కంగాల అభి పిలుపునిచ్చారు.

# ప్రజా పాలన కాదు.. ప్రజా వంచన పాలన

**– పోలీసుల తీరుపై బీఆర్ఎస్ యువజన నేత ప్రవీణ్ ప్రకాష్ నాయక్ ఆగ్రహం**



**చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలపై అసెంబ్లీలో ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు, తుంగారం సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్ ప్రకాష్ నాయక్ ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్‌తో లోక్‌సభకు వెళ్లడంలో అభ్యంతరం లేనప్పుడు, తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పోలీసులు అమానుషంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పాలనలో మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన సిగ్గుచేటని విమర్శించారు.ఈ కార్యక్రమంలో నల్లమోతు వెంకటనారాయణ, ఉన్నం నాగరాజు, బానోత్ బాలు నాయక్, బడికల శ్రావణ్ కుమార్, మేడా మోహన్ రావు, భూపతి రమేష్, కేలోత్ శ్రీను నాయక్, పూనం వెంకటేశ్వర్లు, ఉప్పతల గణేష్, మంద అనిల్, పోశం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వాక్యాలను ఖండించిన సర్పంచ్



**చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్ )ప్రతినిధి;** స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి అసెంబ్లీ పరారంభమైన తొలిరోజే ఎతీం పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కేటీఆర్ హరీష్ రావు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన తోపులాట ఘటనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం మహిళా కానిస్టేబుల్ సమీక్షంలో టీ షర్టు విప్పి దౌర్జన్యంగా వ్యవహరించడం విధుల్లో ఉన్న పోలీసులపై చేయి చేసుకోవడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదు యావత్ తెలంగాణ ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలని ఎలా వ్యవహరిస్తున్నారు అని అన్నారు స్పీకర్ గడ్డం ప్రసాద్ గారికి తాత మధుగారు బహిరంగం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

## స్పీకర్ పై అసభ్యకర వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

**భద్రాద్రి న్యూస్ వెంకటాపురం**



తెలంగాణ శాసనసభ స్పీకర్, దళిత నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్ గారిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిట్యాల సాగర్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ విధంగా వ్యక్తిగతంగా, అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలకు దిగడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన తాతా మధు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని చిట్యాల సాగర్ డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవులను, ప్రజాప్రతినిధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయాల్లో హుందాతనం, సంయమనం పాటించాలని ఆయనసూచించారు.

# ఏ హోదాలో వస్తున్నారు...?

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో రుక్మిణి కళ్యాణం లో పాల్గొన్న ఆలయ ఈవో భవాని శంకర్ మరియు ప్రమాణ స్వీకారం చేయని ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నరసింహామూర్తి దంపతులు...? యాదగిరిగుట్ట దేవాలయానికి గతంలో అనువంశిక ధర్మకర్తగా ఉన్న నరసింహామూర్తి. కాంగ్రెస్ ప్రభుత్వంలో దేవస్థానం కు ట్రస్ట్ బోర్డు నియమించిన తరువాత అనువంశిక ధర్మకర్త అయిన నరసింహామూర్తిని ట్రస్ట్ బోర్డు మెంబర్ గా నియమించిన ప్రభుత్వం. ప్రభుత్వం ట్రస్టు బోర్డు మెంబర్ గా నియమించినప్పటి నుండి ఇప్పటివరకు ప్రమాణ స్వీకారం చేయని నరసింహామూర్తి. ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కోర్టుకు వెళ్లిన నరసింహామూర్తి ఈయన గారు మరి ఇప్పుడు అనువంశిక ధర్మకర్త హోదా లోనా లేదా ట్రస్టు బోర్డు మెంబర్ హోదా లోనా దేవస్థానంలో జరిగే కార్యక్రమంలో ఎలా పాల్గొంటున్నారు అనేది ప్రశ్నార్ధకంగా మారింది ఇప్పటికైనా ఆయన ఏ హోదాలో ఉత్సవాలలో పాల్గొంటున్నాడు ఈఓ గారు తెలపాలని కోరుతున్నారు స్థానికులు మరియు భక్తులు.

భద్రాద్రి న్యూస్
మంగళవారం 8, సెప్టెంబర్, 2026

# ఆర్టీసీ బస్సులు లేక.. ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ

**ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసులు తక్షణమే పునరుద్ధరించాలి**

**చర్ల మండల యూత్ నాయకుడు పరిటాల సంతోష్ కుమార్ విజ్ఞప్తి**



**చర్ల: సెప్టెంబర్ 7 భద్రాద్రి న్యూస్:**

చర్ల మండలం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చర్ల మండల యూత్ నాయకుడు పరిటాల సంతోష్ కుమార్ తెలిపారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ట్రావెల్స్‌పైనే ఆధారపడాల్సి వస్తోందని, ఇదే అదనుగా ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు అధిక చార్జీలు వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేదలు, విద్యార్థులు, రైతులు, వైద్యం కోసం ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు తక్కువ చార్జీలతో సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని అందించే ఆర్టీసీ బస్సులే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి చర్ల మండల ప్రజల ప్రయాణ ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పరిటాల సంతోష్ కుమార్ ఆర్టీసీ అధికారులకు పలు విజ్ఞప్తులు చేశారు.

1. చర్ల--కొత్తగూడెం: ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు చర్ల బస్టాండ్ నుంచి కొత్తగూడెంకు బస్సు నడిపి, తిరిగి సాయంత్రం 4 గంటలకు కొత్తగూడెం నుంచి చర్లకు బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి.
2. భద్రాచలం--వరంగల్ (చర్ల, వెంకటాపురం మీదుగా): సాయంత్రం 7 గంటలకు ఈ మార్గంలో బస్సు సర్వీసును పునరుద్ధరించాలి.
3. చర్ల--హైదరాబాద్: సాయంత్రం 7 గంటలకు చర్ల నుంచి హైదరాబాద్‌కు నేరుగా బస్సు సర్వీసును ప్రారంభించాలి.

ప్రైవేట్ ట్రావెల్స్ అధిక చార్జీలను అరికట్టడంతో పాటు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా పై మూడు బస్సు సర్వీసులను తక్షణమే ప్రారంభించాలని పరిటాల సంతోష్ కుమార్ ఆర్టీసీ అధికారులను విజ్ఞప్తి చేశారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**1000 రోజులు గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు కాలేదు:బిఆర్ ఎస్**



**వెంకటాపురం భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 7**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ వెంకటాపురం మండల కమిటీ డిమాండ్ చేసింది. ప్రజావాణి కార్యక్రమంలో వీ=ాకు వినతిపత్రం సమర్పించిన బీఆర్ఎస్ నాయకులు 6 గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను అమలు చేయాలని డిమాండ్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా హామీలు నెరవేర్చలేదని విమర్శ హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపాటు ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వీ=ా కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్స్ పార్టీ మండల అధ్యక్షుడు గంప రాంబాబు గారు, సర్పంచులు, షోలం హోంపతి, పూజారి ఆదిలక్ష్మి,ఎ=ఖ పురం సర్పంచ్ రమ్య, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రముఖ యూట్యూబర్ నందుస్ వరల్డ్ అరెస్ట్




శంషాబాద్ ఎయిర్ పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు లండన్లో ఉద్యోగాలు, స్పాన్సర్షిప్ పేరుతో పలువురి నుంచి డబ్బు తీసుకొని మోసం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఇప్పటికే ఆమెపై పలు కేసులు సైతం నమోదు లుకౌట్ నోటీసులు జారీ కావడంతో.. ఈ క్రమంలోనే ఆమెను అరెస్టు చేసిన పోలీసులు

# 6 గ్యారంటీలు.. 420 హామీలు ఎక్కడ?

**వెయ్యి రోజులు పూర్తయినా ఒక్క హామీ పూర్తిగా అమలు కాలేదు**

**ప్రజల హామీ బాకీలు చెల్లించాలి.. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తాం: బీఆర్ఎస్**

**చర్ల, సెప్టెంబర్ 7 (భద్రాద్రి న్యూస్):**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం చర్ల మండలంలో ఆరో రోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా.. చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ ఐనవోలు పవన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ప్రజావాణి కార్యక్రమానికి చేరుకున్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను బాకీలుగా భావించి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున 33 నెలలకు ఒక్కొక్క మహిళకు రూ.82,500 బకాయి ఉందని, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పాటు ఆడబిడ్డకు తులం బంగారం హామీని అమలు చేయాలని కోరారు. ఆసరా పింఛన్లు 33 నెలలకు ఒక్కొక్కరికి రూ.66 వేల బకాయి ఉన్నాయని ఆరోపించారు. అదేవిధంగా విద్యార్థులకు స్కూటీలు, దివ్యాంగులకు నెలకు రూ.2,000 చొప్పున 33 నెలలకు రూ.66 వేల బకాయి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.12 వేల కోట్ల బకాయిలు, రైతు భరోసా, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం, ఆటో కార్మికులకు రూ.12 వేల సాయం వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని తాతారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్.డి. అజీజ్, యడ్ల రామదాసు, తోటపల్లి మాధవరావు, యూత్ నాయకులు కాకి అనిల్, అంబోజి సతీష్, కొంబత్తి రాము, తడికల బుల్లెబ్బాయి, గోరింట్ల వెంకటేశ్వరరావు, కట్టడం కన్నారావు, కారం కన్నారావు, సంతపూరి సతీష్, కుక్కడపు సాయి, గాదంశెట్టి కిషోర్, పాసిగంటి సంతోష్, తడికల చంద్రశేఖర్, రావుల కిషోర్, మేడబత్తిని గోవర్ధన్, రాట్నాల శ్రీరామ్మూర్తి, మైప వెంకటేశ్వర్లు, తడికల వెంకటేశ్వర్లు, మామిడి రాజు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ కారేపల్లిలో కాంగ్రెస్ రాస్తారోకో

**తాతా మధు బహిరంగ క్షమాపణ చెప్పాలి.. పదవికి రాజీనామా చేయాలి**

**లేకుంటే మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలి: కాంగ్రెస్ నాయకుల డిమాండ్**

**కారేపల్లి, సెప్టెంబర్ 7 (భద్రాద్రి న్యూస్ ):**



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కారేపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. తాతా మధు మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దారావత్ భద్రు మాట్లాడుతూ.. రాష్ట్ర అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు తాతా మధు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, తన వ్యాఖ్యలకు నైతిక బాధ్యత వహిస్తూ శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శాసనమండలి చైర్మన్ తనకు ఉన్న అధికారాలను వినియోగించి సభ్యత్వంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అనుచిత వ్యాఖ్యలను ఉపేక్షించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, జిల్లా నాయకులు సురేందర్ మానియర్, భీముడు నాయక్, తిరుమలరావు, మండల సర్పంచ్‌ల అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్, సర్పంచ్‌లు రాందాస్, ప్రవీణ్, వీరాస్వామి, ఎల్లయ్య, రూప్ల, షేరు తాజుద్దీన్, హర్షగాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసులతో దద్దరిల్లిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ



**తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఏటూర్‌నాగారం ఐటీడీఏ మార్చ్-ముట్టడి**

**భారీ నిరసన కార్యక్రమం విజయవంతం.. వేలాదిగా తరలివచ్చిన ఆదివాసులు**

**వెంకటాపురం భద్రాద్రి న్యూస్, సెప్టెంబర్ 7**



ఆదివాసుల హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ మార్చ్--ముట్టడి కార్యక్రమం భారీగా విజయవంతమైంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసులు, యువతీ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివాసుల హక్కులను పరిరక్షించాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 5వ షెడ్యూల్, పీసా చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు నినాదాలు చేశారు. ఆదివాసీ యువతకు ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు ఆదివాసీ ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. వేలాది మంది ఆదివాసులు ఏటూర్‌నాగారం ఐటీడీఏకు తరలిరావడంతో ప్రాంతమంతా ఆదివాసీ నినాదాలతో దద్దరిల్లింది. శాంతియుతంగా నిర్వహించిన ఈ మార్చ్--ముట్టడి కార్యక్రమం విజయవంతం కావడంతో తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, తక్షణమే చర్చలు జరిపి న్యాయం చేయాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చెయ్యాలి

**ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసిన చిట్టెం శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.**



**వెంకటాపురం భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 7:**
దళితుడైన స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన దిగజారుడు వ్యాఖ్యలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. దళిత స్పీకర్‌పై అసభ్య పదజాలం బీఆర్ఎస్ నేతల దురహంకారానికి పరాకాష్ట. ఎమ్మెల్సీ తాతా మధు.. ఒక దళిత స్పీకర్‌ను ఉద్దేశించి తీవ్రమైన పదజాలం ఉపయోగించడం అత్యంత అభ్యంతరకరం. ఇది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు. దళిత స్పీకర్ మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన తీరుగా తెలంగాణ సమాజం చూస్తోంది. సభలో మాట్లాడటానికి దమ్ము లేక,ప్రజల సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక,తమ నాయకుడు అసెంబ్లీకి రాకపోవడంపై సమాధానం చెప్పలేక... విషయాన్ని పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అడ్డమైన పిచ్చివేషాలు తెలంగాణ ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజకీయ భేదాలు ఉండొచ్చు. విమర్శలు చేసుకోవచ్చు. కానీ స్పీకర్ పదవికి, వ్యక్తిగత గౌరవానికి,దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే స్థాయిలో అసభ్య పదజాలం ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఈ దురహంకారాన్ని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని చిట్టెం శ్రీనివాస్ కోరారు.

# హెచ్‌సీఏ అండర్-16 జట్టుకు పాల్వంచ క్రీడాకారులు










**పాల్వంచ, సెప్టెంబర్ 07 (భద్రాద్రి న్యూస్):**
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-16 జట్టుకు పాల్వంచకు చెందిన నెక్స్ట్‌జెన్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు సృజంత్, దివాకర్, ప్రిన్స్ ఎంపికయ్యారు. హెచ్‌సీఏ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి ఈ ముగ్గురు క్రీడాకారులు జట్టులో చోటు దక్కించుకున్నారు. ఒకేసారి పాల్వంచకు చెందిన ముగ్గురు యువ క్రీడాకారులు హెచ్‌సీఏ అండర్-16 జట్టుకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇది పాల్వంచ క్రీడా రంగానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నెక్స్ట్‌జెన్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు అభిమన్యు, శరత్ కళ్యాణ్, పవన్ సాయి, పవన్ సీలపోగు మాట్లాడుతూ సృజంత్, దివాకర్, ప్రిన్స్ ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో కష్టపడి సాధన చేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హెచ్‌సీఏ అండర్-16 జట్టులో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్వంచకు మంచి పేరు తీసుకురావాలని కోచ్‌లు కోరారు.

# హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలం



ఎన్నికల్లో అనేక హామీలతో అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్ప టికీ వాటి అమలు చేయడం లో రేవంత్ సర్కార్ విఫల మైందని బిఆర్ఎస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ త క్కులపల్లి చందర్ రావు విమ ర్శించారు.సోమవారం మా జీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా మండల కేంద్రంలో గల రైతు వేదిక వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ నర్మదా,తహసిల్దార్ విక్రమ్ కుమార్ లకు వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన విలేకరులతో మా ట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదా పు మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలలో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అ మలు చేయలేదని ఎద్దేవా చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయ కుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని వి మర్శించారు.ప్రజా సమస్య లను పరిష్కరించి,ఎన్నికల హామీలను తక్షణమే అమ లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు,మండల స ర్పంచుల ఫోరమ్ కన్వీనర్ గడ్డం రఘువంశీ గౌడ్,సర్పం చ్ షేక్ ఉస్మాన్ అలీ,మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్, మాజీ దేవస్థాన చైర్మన్ ము నిగాల సమ్మయ్య,సీనియర్ నాయకులు దుపెల్లి కొము రయ్య,గుంషావాలి,అడ్డగూడి సతీష్,పుల్యాల రాజిరెడ్డి మరుపట్ల నరేష్,కట్కూరి రాజు, కళ్యాణ్, అఖిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా 'అక్షరం ఆయుధం'.. ఎక్సైజ్ సీఐతో ప్రత్యేక భేటీ

**ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ.. నిష్పక్షపాత వార్తలే లక్ష్యం**



**కారేపల్లి, సెప్టెంబర్ 7 (భద్రాద్రి న్యూస్-):**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్న 'అక్షరం ఆయుధం' వార్తా బృందం సభ్యులు సోమవారం ఎక్సైజ్ సీఐను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో సింగరేణి మండల పరిధిలో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై సీఐతో విలేకరులు చర్చించారు. ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన కార్యకలాపాలు, వాటిపై శాఖాపరంగా తీసుకుంటున్న చర్యల గురించి చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల బాధ్యత, ప్రజలకు--అధికార యంత్రాంగానికి మధ్య వారధిగా మీడియా వ్యవహరించాల్సిన తీరుపై కూడా చర్చ జరిగింది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను వాస్తవాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా 'అక్షరం ఆయుధం' వార్తా బృందం సభ్యులు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సమస్యల పరిష్కారానికి అవసరమైన సమాచారాన్ని ప్రజలకు అందిస్తూ బాధ్యతాయుతమైన పాత్రికేయతను కొనసాగిస్తామని తెలిపారు. ప్రజా ప్రయోజనమే పరమావధిగా.. ప్రజల గొంతుకగా 'అక్షరం ఆయుధం' తన బాధ్యతను నిరంతరం కొనసాగిస్తుందని బృంద సభ్యులు స్పష్టం చేశారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాత మధు అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన





**వైరా, సెప్టెంబర్ 7,( భద్రాద్రి న్యూస్ )**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ వైరా మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు

ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా అనుచిత పదజాలం ఉపయోగించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం వైరా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ తాత మధుపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని కోరుతూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు పిటిషన్ అందజేశారు. రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ద

ఈ నిరసన ర్యాలీలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతా , జిల్లా నాయకులు పోదిల హరినాథ్, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళి కృష్ణ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పణితి శ్రీనివాస్ రావు, సర్పంచులు నూతి వెంకటేశ్వర్లు, జవ్వాజి అశ్విని నాగరాజ్, తడికమళ్ళ నాగార్జున, కౌన్సిలర్లు మోరే శ్రీకాంత్, రాచబంటి బలరామయ్య, ఉండ్రు శ్యాంబాబు, వేముల రత్నాకర్, కర్నాటి హనుమంతరావు, కొల్లి రమేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వర్లు, పువ్వాళ్ళ రాము, తోటకూర గోపి, తెళ్ళూరి వీరయ్య, జవ్వాజి నాగరాజు, వేల్పుల వెంకటేశ్వర్లు, వంకూడోతు భిక్యా, సయ్యద్ అన్వర్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్ము మీరా, వేల్పుల రత్న భారత్, సరిపుడి కోటేశ్వరరావు, పాసంగులపాటి రవి, చింతనిప్పు ప్రసాద్, పరస రవి, తేజావత్ రాము, మోదుగు వెంకటి, షేక్ ఉద్దండు, షేక్ సైదులు, తోటకూర వీరబాబు, పూర్ణకంటి లక్ష్మయ్య, కార్యకర్తలు, దళిత నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొల్లపూడి పులికొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఘనంగా పవిత్రోత్సవాలు

**శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ**



**వైరా, సెప్టెంబర్ 7, (భద్రాద్రి న్యూస్)**
వైరా నియోజకవర్గ మండల పరిధి గొల్లపూడి గ్రామ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ పులికొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సోమవారం పవిత్రోత్సవాలను కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. పులికొండ దేవాలయంలో గత మూడు రోజులుగా స్వామివారికి పవిత్రోత్సవాల సందర్భంగా అభిషేక పూజలు హోమాలు వేద పండితుల మధ్య ఘనంగా నిర్వహించారు. దేవస్థానంలో లక్ష్మీనరసింహస్వామి వెలసిన స్థానంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి శ్రీ శ్రీ శ్రీ వేదానంద సరస్వతి శ్రీమాన్ డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి ముఖ్య అతిథులుగా హాజరై వేదమంత్రాల నడుమ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వేలాదిమంది పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహ స్వామికి 108 కలిశాలతో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ప్రతిష్ఠ మహోత్సవంలో ఎండోమెంట్ జిల్లా అధికారి ఎం వీరస్వామి పాల్గొని మాట్లాడుతూ శ్రీ పులికొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి మంచి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బాలాజీ నాయక్, దేవస్థానం కమిటీ చైర్మన్ ఈవూరి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మేడూరు రామారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి సతీష్, దేవాలయం ఈవో ఎస్ వి డి ప్రసాద్ శ్రీనివాసరావు, వేద పండితులు, రఘునాథచార్యులు, కృష్ణమాచార్యులు, దేవాలయ ప్రధాన అర్చకులు, రవికుమార్, ఆచార్యులు, పాలకవర్గ సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

భద్రాద్రి న్యూస్
మంగళవారం 8, సెప్టెంబర్, 2026

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ కారేపల్లిలో కాంగ్రెస్ రాస్తారోకో









**తాతా మధు బహిరంగ క్షమాపణ చెప్పాలి.. పదవికి రాజీనామా చేయాలి**

**లేకుంటే మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలి: కాంగ్రెస్ నాయకుల డిమాండ్**

**కారేపల్లి, సెప్టెంబర్ 7 (భద్రాద్రి న్యూస్ రాములు ):**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కారేపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. తాతా మధు మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దారావత్ భద్రు మాట్లాడుతూ.. రాష్ట్ర అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు తాతా మధు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, తన వ్యాఖ్యలకు నైతిక బాధ్యత వహిస్తూ శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శాసనమండలి చైర్మన్ తనకు ఉన్న అధికారాలను వినియోగించి సభ్యత్వంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అనుచిత వ్యాఖ్యలను ఉపేక్షించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, జిల్లా నాయకులు సురేందర్ మానియర్, భీముడు నాయక్, తిరుమలరావు, మండల సర్పంచ్‌ల అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్, సర్పంచ్‌లు రాందాస్, ప్రవీణ్, వీరాస్వామి, ఎల్లయ్య, రూప్ల, షేరు తాజుద్దీన్, హర్షగాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

**పెరిగిన ఉష్ణోగ్రతలతో బెంబేలెత్తుతున్న జనం**
**తీవ్రమవుతున్న ఎల్ నినో ప్రభావం**
**వర్షఋతువులో జాడ లేని వర్షాలు**
**రుతుపవనాలపై ప్రభావం చూపుతున్న ఎల్ నినో**
**అడుగంటుతున్న భూగర్భ జలాలు**
**తగ్గిన వరి సాగు విస్తీర్ణం, తగ్గనున్న పంట దిగుబడి**

శ్రావణ మాసాన్ని వర్షఋతువుగా పేర్కొంటారు. శ్రావణ మాసంలో ఆశించిన వర్షాలు కురుస్తాయని ప్రతి ఒక్కరూ భావించారు. వ్యవసాయ పనులు ముందుకు సాగుతాయని సంతోషపడ్డారు. వర్ష ఋతువులో కష్టాలు గట్టెకుతాయని ఆశించిన అన్నదాతకు నిరాశే ఎదురైంది. శ్రావణమాసం ప్రారంభమై 20 రోజులు గడిచిన వర్షాలు జాడ లేకుండా పోయాయి. వాతావరణం చల్లబడి అధిక వర్షపాతం నమోదవుతుందని ఆశించిన ప్రజలకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. భూగర్భ నీటిమట్టం రోజురోజుకు అడుగంటుతుంది. దీంతో సాగు, తాగునీటి సమస్య తీవ్రమౌతుంది. వరి సాగు విస్తీర్ణం ఈ వానాకాలంలో తగ్గింది. పంట దిగుబడి కూడా తగ్గే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. కొందరు రైతులు క్రాఫ్ హాలిడే ప్రకటించారు. వ్యవసాయ పనులకు ఫుల్ స్టాప్ పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. నాలుగైదు రోజులుగా ఎండ తీవ్రతతో పాటు ఉక్క పోత అధికమైంది. ఉక్క పూతకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యుత్తు వాడకం పెరిగింది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారు కార్యాలయాల్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణం లో మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం తద్వారా ఉబ్బ తీవ్రతరం కావడంతో జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. శ్రావణ మాసంలో సైతం కూలర్లను ఏసీలను వినియోగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎప్పుడు ఈ రకమైన పరిస్థితి శ్రావణమాసంలో కనిపించలేదని ప్రజలు పేర్కొంటున్నారు. సూపర్ ఎల్ నినో వచ్చేస్తుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థ పేర్కొంది. సూపర్ ఎల్ నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు ఉంటుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థ సూచించింది. ఇకముందు ఈ ప్రభావము పెరగవచ్చని పేర్కొంది. దీంతో జనం ఆందోళన చెందుతున్నారు. ఎల్ నినో ప్రభావం కారణంగా కీలకమైన నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపుతుంది. వర్షాలు కురవకుండా అడ్డుపడుతుంది. ఋతుపవనాలు బలహీనంగా ఉండడంతోపాటు వడగాల్పులు పెరుగుతుంటాయి. ఈ సంవత్సరం ఏర్పడ్డ ఎల్ నినో చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రంగా ఉంటుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థ సూచించింది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలోని ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణ రీతిలో ఉండడం



ఇందుకు కారణం అంటున్నారు. జూన్ మాసం నుండి ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే పెరుగుతున్నాయి. భూగర్భ నీటిమట్టం సైతం అడుగంటుతుంది. భారతదేశంలో ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉందని పేర్కొంటున్నారు. రానున్న రెండు మూడు నెలలు దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని అంతర్జాతీయ వాతావరణ సంస్థ సూచించింది. దీంతో భూగర్భ జలం మరింత అడుగంటక తప్పదు. తీవ్ర తాగునీటి సమస్య కూడా ఏర్పడుతుంది. వాతావరణ శాఖ అంచనాల మేరకు భూగర్భ నీటిమట్టం మైనస్ మీటర్లలోకి పడిపోయింది. సూపర్ ఎల్ నినో ప్రభావము భారతదేశంపై తీవ్రంగా చూపుతున్న నేపథ్యంలో రానున్న మూడు మాసాలలో పరిస్థితులను అంచనా వేసుకొని జనం ఆందోళన చెందుతున్నారు. రైతులు మాత్రం బోర్లు, వ్యవసాయ బావుల నిర్మాణం చేపట్టి పంటల సాగుపై దృష్టి సారించారు. భూగర్భ నీటిమట్టం అడుగంటుతున్న నేపథ్యంలో బోర్లు బావుల నుండి పూర్తిస్థాయిలో నీరు అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కువ శాతం మంది రైతులు బోర్ల నిర్మాణం చేపడుతున్న నేపద్యంలో నీటి అధిక వినియోగం కారణంగా భూగర్భ నీటిమట్టం తగ్గుతుంది. ఆరుతడి పంటలు సాగు చేసినప్పటికీ తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అన్నదాత నష్టపోతున్నారు. కందులు, పెసలు, వేరుశనగ, మొక్కజొన్న ధరలు కూడా చుక్కలనంటే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు పంటల సాగు, తాగు సాగునీటి, వివిధ రకాల వస్తువుల ధరలపై తీవ్ర ప్రభావాన్ని భవిష్యత్తులో చూపనున్నాయి. ఈ సంవత్సరం ప్రజలు గడ్డు పరిస్థితులను ఎదుర్కోక తప్పదని అర్థమవుతుంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన మాజీ ఎంపీ నామ

**బీఆర్ఎస్ నిరసనను అడ్డుకోవడం అప్రజాస్వామికం: మాజీ ఎంపీ నామ**



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):-**
అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల అత్యుత్సాహం అప్రజాస్వామికమని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ వద్ద నల్ల దుస్తులు ధరించి నిరసనకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు బలవంతంగా అడ్డుకోవడం, అరెస్టు చేయడాన్ని మాజీ ఎంపీ నామ తీవ్రంగా ఖండించారు. అరెస్టు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పోలీసుల బలప్రయోగం, తోపులాటల కారణంగా కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి స్వల్ప గాయాలు కావడం శోచనీయమన్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన తోపులాటలో మాజీ మంత్రి హరీశ్‌రావు కిందపడేలా చేయడం పోలీసుల వ్యవహార శైలికి నిదర్శనమని విమర్శించారు. మహిళా సాధికారత గురించి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, మహిళా ఎమ్మెల్యేలైన సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి పట్ల చూపుతున్న గౌరవం ఇదేనా అని నామ ప్రశ్నించారు. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్, మహిళా ప్రజాప్రతినిధులనే ఈ విధంగా బలవంతంగా లాక్కెళ్లడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారన్న భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అరెస్టులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మాజీ ఎంపీ నామ ఆరోపించారు. ప్రతిపక్షం నిరసన తెలిపే హక్కును కూడా హరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. “కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసనలు చేస్తే అది ప్రజాస్వామ్యం.. తెలంగాణలో ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు నిరసన చేస్తే అరెస్టులు ఎందుకు?” అని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు నల్ల చొక్కా ధరించి వెళ్లి నిరసన వ్యక్తం చేస్తే తప్పులేదని భావించే కాంగ్రెస్ నాయకత్వం, తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలపడానికి ఎందుకు అడ్డంకులు సృష్టిస్తోందని నిలదీశారు. “కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో ఒక న్యాయం.. తెలంగాణలో మరో న్యాయమా? ఇదేనా కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి?” అని మాజీ ఎంపీ నామ ప్రశ్నించారు. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల గొంతును పోలీసు బలగాలతో నొక్కివేయాలని ప్రయత్నిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కొనసాగుతున్న అణచివేత ధోరణికి తగిన సమయంలో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# తెలంగాణలో ర్యాపిడో, ఉబర్, ఓలా బైక్‌లకు ఎల్లో రంగు నంబర్ ప్లేట్లు




ఎల్లో రంగు నంబర్ ప్లేట్‌తో ఉంటేనే బైక్ ట్యాక్సీగా నడిపేందుకు అనుమతించేలా నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం ఎల్లో ప్లేట్‌గా మార్చుకునేందుకు మళ్లీ వాణిజ్య చార్జీలు వసూలు బైక్‌కు ఎల్లో రంగు నంబర్ ప్లేట్‌గా మార్చుకోవాలంటే కన్వర్షన్ చార్జీలు రూ.3 వేలు, ఆ తర్వాత క్రమం కమర్షియల్ రోడ్ ట్యాక్స్, క్వార్టర్లీ ట్యాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యూవల్ ఫీజు, గ్రీన్ ట్యాక్స్, పర్మిట్ ఫీజులు ఇలా చాలా మొత్తంలో చెల్లించాల్సిందే ఇదే జరిగితే ప్రస్తుతం ఉన్న 18 వేలకు పైగా బైక్ ట్యాక్సీలు మాయం బైక్ ట్యాక్సీలు దూరమైతే క్యాబ్, ఆటో ఛార్జీలు భారీగా పెరిగే అవకాశం

# సెప్టెంబర్ 19న కోదాడ మెగా జాబ్ మేళా

**నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతర కృషి అవసరం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**





**కోదాడ , సెప్టెంబర్ 7(భద్రాద్రి న్యూస్):**
నిరుద్యోగం నేడు మన సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యావంతులైన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య ఒక్కరోజులో లేదా ఒక్క జాబ్ మేళాతో పూర్తిగా పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతర, ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను నియామక సంస్థలతో నేరుగా అనుసంధానం చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తన 32 ఏళ్ల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సాధ్యమైనంతమంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేశానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రయత్నాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 19వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కోదాడ పట్టణంలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, అవసరమైన ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుందని తెలిపారు. 2025 అక్టోబర్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్ మెగా జాబ్ మేళాకు దాదాపు 40 వేల మంది నమోదు చేసుకోగా, 20,463 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని గుర్తుచేశారు. వారిలో 2,041 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 1,533 మంది తదుపరి నియామకాల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. మొత్తం 3,574 మంది యువతకు ప్రత్యక్షంగా లేదా భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశం లభించిందన్నారు. కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి ఎన్. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా జాబ్ మేళా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ ఎంపీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే శ్రీ మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నందలాల్ పవార్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ శ్రీ నరసింహ, ఐపీఎస్, కోదాడ ఆర్డీఓ శ్రీ సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి ఎర్నేని కుసుమ, వైస్ ఛైర్‌పర్సన్ శ్రీమతి మల్లేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీ కోటేశ్వరరావుతోపాటు పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. అభ్యర్థుల నమోదు, కంపెనీల భాగస్వామ్యం, ప్రచారం, ఇంటర్వ్యూ సదుపాయాలు, రవాణా, భద్రత, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కమిటీ సమన్వయం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమ తేదీ సమీపించే నాటికి మరికొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులను నిర్వహణ కమిటీలో చేర్చనున్నట్లు తెలిపారు. నిర్వహణ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో జరుగుతుందని వెల్లడించారు.

# మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల ప్రవర్తన దుశ్శాసన పర్వమే

**పోలిసుల తిరుపైవైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి ఆగ్రహం**

**ప్రజల పక్షాన మాట్లాడటమే వారు చేసిన పాపమా?**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):**
అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర అవమానకరమని వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను ‘దుశ్శాసన పర్వం’గా భావిస్తున్నామని అన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పోలీసుల ప్రవర్తనను ఆమె తీవ్రంగా ఖండించారు.
ప్రతిపక్ష మహిళా ఎమ్మెల్యేలు ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం తప్పా? ప్రజల పక్షాన మాట్లాడటమే వారు చేసిన పాపమా? అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా పోలీసులు జుట్టు పట్టుకుని లాగడం, తోసేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. ఈ క్రమంలో వారు అసెంబ్లీ గ్రిల్స్‌పై పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.
ఈ ఘటన కేవలం ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానం కాదని, రాష్ట్రంలోని మహిళలందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను కాలరాస్తూ, ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలు, ప్రజా సమస్యలు బయటకు రాకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించే వారిని అడ్డుకోవడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆమె హెచ్చరించారు.

# ఏలూరు డీఆర్ ఓ మర్రి శ్రీదేవి పై వేధింపులు ఆపాలి

**శాఖాపరమైన విచారణ జరపాలి**

**కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్దన్ డిమాండ్**



**విజయవాడ ,సెప్టెంబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):–**
డీఆర్ ఓ మర్రి శ్రీదేవి గారి పట్ల అనుచిత ప్రవర్తనపై ఉన్నత స్థాయి విచారణ జరపాలి
భాధ్యతలు నిర్వర్తించే విధం గా ప్రభుత్వం అదేశాలువ్వాలని రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్దన్ డిమాండ్ చేసారు.సోమవారం విజయవాడ లో ఆయన విడుదల చేసిన ప్రకటన లో దామాషా ప్రకారం 25 శాతం ఉన్న కాపు తెలగ బలిజ ఒంటరి తూర్పు కాపు మున్నూరుకాపు ఉద్యోగులకు వేధింపులు లేకుండా తమ విధులు కొనసాగే విధం గా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చందు జనార్దన్ డిమాండ్ చేశారు.ఏలూరు జిల్లా డి ఆర్ ఓ మర్రి శ్రీదేవి పట్ల ఉన్నతాధికారి దురుసుగా ప్రవర్తించడం దుర్భాష లాడటం పట్ల ప్రముఖ దినపత్రికలో వచ్చిన కథనం లో చాలా ఆవేదనతో కూడిన కథనం రావడం,గౌరవ కుటుంబ సభ్యురాలు డిఆర్ ఓ మర్రి శ్రీదేవి సెలవు పై వెళ్లడం పట్ల రాష్ట్ర కాపు జే ఏ సీ తీవ్రం గా ఖండిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని,డీఆర్ ఓ విధులు నిర్వర్తించే విధంగా శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సంఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ దృష్టికి మంత్రి అనగాని సత్య ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ తెలిపారు.

# ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాల రద్దుపై రైతులకు న్యాయం చేయాలి



**రైతులకు ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా పట్టాలు రద్దు చేయడంపై పునర్విచారణ చేయాలి**

**పెద్దతండా సర్పంచ్ పూర్ణచందర్ లాల్**

**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 7 (భద్రాద్రి న్యూస్):**
ఉమ్మడి రేగళ్ల గ్రామపంచాయతీ పరిధిలో చాతకొండ రేంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అటవీ భూముల సర్వేకు సంబంధించి, సుమారు వంద మందికి పైగా గిరిజన రైతుల ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు రద్దు చేసినట్లు వస్తున్న సమాచారంపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని లక్ష్మీదేవిపల్లి మండలం పెద్దతండా సర్పంచ్ పూర్ణచందర్ లాల్ కోరారు. ఈ విషయమై సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రైతుల సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి రేగళ్ల గ్రామపంచాయతీ ప్రస్తుతం ఐదు గ్రామపంచాయతీలుగా విభజించబడినప్పటికీ, ఈ పరిధిలోని సుమారు 10 హాబిటేషన్లలో 4,000 మందికి పైగా రైతాంగం వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అనేకమంది గిరిజన రైతులకు రెవెన్యూ పట్టాలు లేకపోవడంతో పాటు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాల విషయంలో కూడా సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు జారీ చేయకుండా ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు రద్దు చేసినట్లయితే, సంబంధిత రైతులకు తమ వాదనలు, అభ్యంతరాలు తెలియజేసుకునే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. అందువల్ల ప్రతి రైతు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా రద్దుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలపై స్పష్టత లేకపోవడం వల్ల రైతులు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు మరియు ఇతర ప్రభుత్వ వ్యవసాయ ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల చాతకొండ రేంజ్‌లో నిర్వహించిన సర్వే వివరాలు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాల రద్దుకు గల కారణాలు, సంబంధిత ఎస్ డి ఎల్ సి నిర్ణయాలు, రైతులకు నోటీసులు ఇచ్చారా లేదా అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను రైతుల ముందు ఉంచాలని పూర్ణచందర్ లాల్ కోరారు. అర్హత కలిగిన గిరిజన రైతుల ఆర్ ఓ ఎఫ్ ఆర్ హక్కులను పరిరక్షించి, వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 16 రోజులైనా ఈశ్వర్ సాయిని ఎందుకు అరెస్టు చేయట్లేదని పోలీసులను ప్రశ్నించిన మాధురి రాథోడ్





నార్సింగి పోలీస్ స్టేషన్‌లో మరోసారి స్టేట్‌మెంట్ ఇచ్చిన మాధురి రాథోడ్ 24 గంటల్లో ఈశ్వర్ సాయిని అరెస్టు చేస్తామంటూ చెప్పిన నార్సింగి పోలీసులు ఈశ్వర్ సాయి, భార్య శరణ్య, సంధ్యా రాణిపై మరో కేసు నమోదు చేయనున్న నార్సింగి పోలీసులు